క్లుప్తంగా

అమిత్‌షా రాజీనామా చేయాలి

గుమ్మలక్ష్మీపురం: భారత రాజ్యాంగ నిర్మాత, అణగారిన ప్రజల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, అప్రతిష్టాకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయాలని సామాజిక చైతన్య వేదిక ఉత్తరాంధ్ర కన్వీనర్ పాలక రంజిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీజేపీ, అమిత్‌షా అహంకారానికి ఈ వ్యాఖ్యలు నిదర్శనమని అన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు మానుకోవాలని, లేకుంటే అణగారిన వర్గాల ప్రజల నుంచి తీవ్రమైన ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

మెరుగైన సేవలందిద్దాం..

• సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు



సేవా వార్షిక ప్రణాళిక వివరిస్తున్న సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

పాలకొండ రూరల్: భగవాన్ సత్యసాయి సేవా సమితుల ద్వారా జనరంజకమైన సేవలు జిల్లా వ్యాప్తంగా అందిద్దామని సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సత్యసాయి మందిరంలో ముఖ్య కార్యకర్తల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన ఏడాది నుంచి ప్రణాళికాబద్ధంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధించిన వార్షిక ప్రణాళికను విడుదల చేశారు. అనంతరం బాల వికాస్ విస్తరణ, కేంద్రాల పెంపు, ఇంటింటా సాయి సంకీర్తనలు, సత్యసాయి వ్రతాల నిర్వహణ, తదితర అంశాలపై సభ్యులతో సమీక్షించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పల్ల నేతాజీనాయుడు, రాష్ట్ర ఇన్‌చార్జ్ ఆర్. కిశోర్‌కుమార్, కర్రా సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర పర్యవేక్షణ



సిబ్బందికి సూచనలు చేస్తున్న, పార్వతీపురం జిల్లా డీపీటీఓ శ్రీనివాసరావు

పాలకొండ రూరల్: ఆర్టీసీ సంస్థ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నామని విజయనగరం డిప్యూటీ సీఎంఈ, పార్వతీపురం మన్యం జిల్లా డీపీటీఓ కొట్నాన శ్రీనివాసరావు అన్నారు. షెడ్యూల్ – 3 పరిధిలో గల పాలకొండ – బూర్జ రహదారిలో బస్సు సర్వీసులపై బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రస్తుత సీజన్‌లో మంచుతో పాటు వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నందున ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యం కల్పించాలని డ్రైవర్లకు సూచించారు. డిపో నుంచి బస్సు బయలుదేరే ముందే చెక్ చేసుకోవాలని తెలిపారు. ఈయన వెంట పాలకొండ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు, మెకానికల్ ఏఈ బీవీఎంకే.రాజు, టైర్స్ ఏడీసీ భాసూరు కృష్ణమూర్తి, తదితరులున్నారు.

నిబంధనలు సడలించాలి

• ఏపీ రైతు సంఘం డిమాండ్



వెలగవాడలో వరి పనలను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘ నాయకులు

పాలకొండ రూరల్: ప్రస్తుత సీజన్‌లో వరుసగా కురుస్తున్న వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. వర్ష ప్రభావంతో మండలంలోని వెలగవాడ, వడమతో పాటు పలు గ్రామాల్లో తడిచిన వరి చేలను సంబంధిత రైతులతో కలసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తడిచిన, మొలకెత్తిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. అవసరమైతే నిబంధనలు సడలించాలని కోరారు. తీవ్ర ఆందోళనలో ఉన్న రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఈయన వెంట సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు వావిలపల్లి రమణమూర్తి, గుడివాడ నీటి సంఘం డైరెక్టర్ పామోటి వైకుంఠరావు, సీమల కాంతారావు, తదితరులున్నారు.

తెరిపివ్వని ముసురు

గుమ్మలక్ష్మీపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసాయి. మంగళవారం అర్ధరాత్రి మొదలుకొని బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురు కమ్ముకుంది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. ఏకధాటిగా వర్షం పడుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



సీతంపేట: ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల కళాశాలలో కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ సూర్యకుమారి, విద్యార్థులు



భామిని: మండల కేంద్రంలోని చర్చిలో క్రైస్తవ గీతాలు ఆలపిస్తున్న విశ్వాసకులు



భామిని: బత్తిలిలో అలరించిన ప్రభువు పుట్టిన పశువులపాక

ఏసే లోక రక్షకుడు..

ప్రపంచానికి శాంతి, కరుణ, ప్రేమను పంచడానికి ఏసుప్రభువు రాకను స్వాగతిస్తూ క్రైస్తవ భక్తులు క్రిస్మస్‌ను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలను విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఏసుక్రీస్తు జననం, ఆయన మానవాళికి అందించిన సందేశాన్ని వివరించారు.

– సీతంపేట/భామిని/ పాలకొండ రూరల్



పాలకొండ రూరల్: పట్టణంలో క్రిస్మస్ వేడుకల్లో సందడి చేస్తున్న యువత



పాలకొండ రూరల్: బేతేలు చర్చిలో రెవరెండ్ పాస్టర్ ఆదాం నేతృత్వంలో క్రిస్మస్ కేక్ వద్ద చిన్నారులు



భామిని: బత్తిలి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాధర్, భక్తులు



గరుగుబిల్లి: రావుపల్లిలోని చర్చిలో ఏసయ్యకు ప్రత్యేక అలంకరణ



భామిని: నల్లరాయిగూడలో బాలఏసును పరిచయం చేస్తున్న ఫాదర్



గుమ్మలక్ష్మీ పురం : కురుపాంలోని గుడ్ సమారిటన్ లూథరన్ చర్చి ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

ఆకర్షించిన ఏసయ్య నఖచిత్రం



గరుగుబిల్లి: క్రిస్మస్ సందర్భంగా ఏసుక్రీస్తు నఖచిత్రాన్ని మండలంలోని నాగూరుకు చెందిన ప్రముఖ నఖచిత్రకారుడు పల్ల పరిశినాయుడు తన చేతి కొనగోటితో వేసి ఆకట్టుకున్నారు. ఈయన ప్రత్యేక రోజులలో నఖచిత్రాలను, వర్ణచిత్రాలను వేసి పలువురు మన్నలను పొందుతున్నారు.

ముసురుకుంది..



పాలకొండ రూరల్: పట్టణంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్నవర్షం

పాలకొండ రూరల్: రెండు రోజులుగా ఎడతెరిపి లేని వర్షంతో అన్నివర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా అల్పపీడన ప్రభావం బుధవారం జరిగిన క్రిస్మస్ వేడుకలపై పడింది. ఎంతో సందడిగా జరగాల్సిన ఈ వేడుక కళ తప్పింది. అలాగే వరి కోతలు పూర్తవడంతో చాలావరకు వరికుప్పలు, ధాన్యం బస్తాలు తడిచిపోవడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. కొన్నిచోట్ల వరి పనల నుంచి మొలకలు రావడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు.

– రోజంతా వర్షాలే..

భామిని: మండలంలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు అల్లాడిపోతున్నారు. అల్పపీడన ప్రభావంతో బుధవారం రోజంతా వర్షం కురవడంతో పొలాల్లో నీరు చేరడంతో వరి పనలు పూర్తిగా తడిచిపోయాయి. మొలకలు రావడంతో రైతులు లబోదిబోముంటున్నారు. పోయిన పంటను ఎలా కాపాడుకోవాలో తెలియక అన్నదాతలు తలలు పట్టుకుంటున్నారు.



భామిని: సోలికిరిలో పొలంలో చేరిన వర్షపునీరు



భామిని: బిల్లుమడ కళ్లంలో తడిచిన ధాన్యం కుప్పలు

వాజ్‌పేయికి ఘన నివాళులు

గరుగుబిల్లి: మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలను మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు టి.శంకరరావు మాట్లాడుతూ రాజకీయాలలో అత్యున్నత విలువలను నెలకొల్పిన ఆదర్శ నాయకుడు వాజ్‌పేయి అని కొనియాడారు. దేశ ఔన్నత్యాన్ని ప్రపంచ పటంలో నిలిపిన వాజ్‌పేయి భావితరాలకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో పెదిరెడ్డి అశోక్, పెంట సురేష్‌కుమార్, కర్రి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి దార్శనికుడు

పాలకొండ రూరల్: మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి గొప్ప దార్శనికుడని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని అన్నారు. వాజ్‌పేయి జయంతి కార్యక్రమాన్ని పాలకొండ పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ పార్టీ శ్రేణులతో కలసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రధానిగా వాజ్‌పేయి దేశానికి ఎనలేని సేవలందించారన్నారు. అనంతరం బీజేపీ పట్టణ అధ్యక్ష పదవికి ఎం.ఉమామహేశ్వరరావును ఎంపిక చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, చొక్కా మహాలక్ష్మి, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ టంకాల దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



పాలకొండ రూరల్: వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

శీతాకాలం...
వ్యాధులకు గాలం





పాలకొండలో పగటి పూట పట్టణాన్ని కమ్మేస్తున్న పొగమంచు (ఇన్‌సెట్లో) చిన్నారులను పరీక్షిస్తున్న వైద్యుడు (ఫైల్)

- వాయుగుండం ప్రభావంతో వర్షాలు
- జిల్లాలో పడిపోయిన ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు తప్పవంటున్న వైద్యులు

పాలకొండ రూరల్: అసలే శీతాకాలం... ఆపై వాయుగుండం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిశాయి. దీంతో ఎక్కడికక్కడ పారిశుధ్యం లోపించింది. అలాగే ఉష్ణోగ్రతలు కూడా తగ్గుముఖం పట్టాయి. పగటిపూట 23 నుంచి 15 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం, సాయంత్రం మంచు కురుస్తోంది. ఈ తరుణంలో నిద్రావస్థలో ఉన్న వైరస్‌లు సైతం విజృంభించి ప్రజలు వ్యాధులబారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. తగు జాగ్రత్తలు పాటించకుంటే ప్రాణాలకు ముప్పు తప్పదని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువగా ఉబ్బసం, ఆయాసం, గుండె జబ్బులున్నవారికి ఇబ్బందులు తప్పవు. ఉదయం జాగింగ్, వాకింగ్‌కు వెళ్లాలంటే చర్మం పొడిబారి బిగుసుగా మారే అవకాశం ఉంది. కాళ్ల మడమలు, పెదవులు పగలడం వంటి సమస్యలు వస్తాయి. చిన్నపిల్లలపై చలి ప్రభావం అధికంగా ఉంటుంది. వివిధ రుగ్మతలున్న వారు తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, అలాంటప్పుడే మనల్ని మనం రక్షించుకోవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

మాయిశ్చరైజర్లు వినియోగించాలి..

చలికాలంలో శరీరానికి మాయిశ్చరైజర్లు తప్పనిసరి. క్రీమ్ బేస్డ్ మాయిశ్చరైజర్లు ఉపయోగించడం చాలా మంచిది. ముఖం, చేతులు, కాళ్లకు రాసుకుంటే చర్మం మృదువుగా తయారవుతుంది. ఎన్నో రకాల మాయిశ్చరైజర్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. రోజూ పడుకునే ముందు, ఉదయం నిద్రలేవగానే రాసుకోవాలి. మాయిశ్చరైజర్లు దొరకని వారు వేజలిన్, వెన్న, కొబ్బరినూనె వంటివి రాసుకున్నా శరీరం మృదువుగా ఉంటుంది.

పాదాలు పగిలితే..

చలికాలంలో పాదాలు పగలడం ఎక్కువగా ఉంటుంది. ఉప్పు కలిపిన గోరువెచ్చటి నీటిలో పాదాలను 10 నిమిషాల పాటు ఉంచాలి. ఆ తర్వాత సబ్బుతో శుభ్రంగా కడుక్కుని, పొడిగుడ్డతో తుడుచుకోవాలి, పగిలిన చోట మాయిశ్చరైజ్ క్రీమ్ రాయాలి. మధుమేహ వ్యాధిగ్రస్తులంతా వైద్యుల సహాలు పాటించాలి.

గ్లిజరిన్ సబ్బులు..

శీతాకాలంలో చర్మం తెల్లగా పొడిబారకుండా ఉండడానికి గ్లిజరిన్ సబ్బులు వాడాలి. సాధారణ సబ్బు కాకుండా అయిల్ గుణం కలిగి ఉన్న సబ్బులు వాడకం మంచిది. అప్పుడే చర్మం మృదువుగా ఉంటుంది. స్నానానికి ముందు ఆలివ్ ఆయిల్, కొబ్బరి నూనెతో శరీరానికి మసాజ్ చేసుకుని తలస్నానం చేయాలి. వేడినీటితో స్నానం చేస్తే చర్మం పొడిబారుతుంది. గోరువెచ్చని నీటితోనే స్నానం చేయాలి. ఎక్కువ సేపు స్నానం చేస్తే చర్మంపై ఉండే కణాలు కూడా దెబ్బతింటాయి.

ఉన్ని దుస్తులు..

చలికాలంలో రాత్రివేళ తమ పనులు ముగించుకుని ఇంటికి వెళ్లేవారు.. పనుల నిమిత్తం బయటకు వచ్చేవారు ఉన్ని దుస్తులు ధరించాలి. బ్రాండెడ్ దుస్తులు అయితే ఇంకా మంచిది. ద్విచక్రవాహనాలపై ప్రయాణించేవారు మంకీ క్యాప్‌లు, చేతులకు గ్లౌజ్, కాలికి షూ ధరించాలి

చిన్నారుల పట్ల జాగ్రత్తలు తప్పనిసరి..



చలికాలంలో చిన్నారులకు జబ్బులు రాకుండా జాగ్రత్త వహించాలి. చలి నుంచి రక్షణకు స్వెట్టర్లు తొడగాలి. గోరువెచ్చని నీటితోనే స్నానం చేయించాలి. ప్రయాణాలు తగ్గించుకోవడం మంచిది. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. పిల్లలకు ఇచ్చే ఆహారంలో ఆకుకూరలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఆస్తమా ఉన్న వారు నిత్యం వాడే మందులను సిద్ధంగా ఉంచుకోవాలి. దుమ్మధూళి పనులకు దూరంగా ఉండాలి. ఇన్‌హేలర్, నెబ్యులైజర్ వంటివి ఇంటిలో అందుబాటులో ఉంచుకోవాలి. వైద్యుడి సలహా మేరకు మందులు వాడాలి. **– జి.నాగభూషణరావు, ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్, పాలకొండ**

సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- చలిగాలులు వీస్తున్న సమయంలో ఇంటి తలుపులు, కిటికీలు మూసి ఉండాలి.
- శరీరానికి వేడిని కలిగించే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి.
- నియంత్రించలేని వణుకు ఉంటే ముందే గుర్తించి చికిత్స తీసుకోవాలి.
- ఆల్కహాలిక్, పానీయాలను స్వీకరించరాదు. దానివల్ల శరీరం డీ హైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉంటుంది.
- పొలం పనులకు వెళ్లేవారికి చలి వల్ల కాళ్లు, చేతులకు దురదలు వస్తుంటాయి. అవివస్తే వేజలిన్, చర్మ క్రీములు రాసుకోవడం మంచిది.
- మందంగా ఉండే దుస్తుల కన్నా పలుచగా ఉన్న దుస్తులు ధరిస్తే మంచిది.
- శరీర ఉష్ణోగ్రత తగ్గకుండా పొడి దుస్తులను ధరించాలి.
- చల్లగాలి ఊపిరితిత్తులకు చేరకుండా నోరుమూసి ఉంచాలి.
- వేడిపాలు, ఆహారం తీసుకోవాలి.
- చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లకుండా చూడాలి.
- చలి తీవ్రతతో జలుబు బాగా చేస్తే ఊపిరి తీసుకునే అవకాశం ఉండదు.
- హృద్రోగులు అధికంగా పనిచేయరాదు.
- సూర్యోదయం తర్వాత జాగింగ్, వ్యాయామం చేయడం మంచిది.
- చలికి పాదాలు పగిలితే గోరువెచ్చని ఉప్పు నీటిలో 5, 10 నిమిషాల పాటు పాదాలు ఉంచాలి
- పాదాల పగుళ్లకు పసుపు, నిమ్మరసం వంటివి రాయకూడదు.

• పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్‌డీపీఓ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌డీపీఓ రాంబాబు

మండలంలోని చినమేరంగి పోలీస్‌స్టేషన్‌ను పాలకొండ ఎస్‌డీపీఓ ఎం.రాంబాబు బుధవారం సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో ఈ ఏడాదిలో నమోదైన కేసు వివరాలు, రికార్డుల పరిశీలించి ,సిబ్బంది పని తీరును పరిశీలించారు. సిబ్బంది ప్రజలకు అందిస్తున్న సేవలు, నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేసారు. సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్ఐ పి.అనీష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

– జియ్యమ్మవలస

స్మృతుల పరిమళం

• నందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పీఎం పాలెం: శిల్పారామంలో పూర్వ విద్యార్థుల స్మృతుల పరిమళం గుభాళించింది. 42 సంవత్సరాల స్నేహబంధాన్ని మరింత పదిల పరచుకుంటూ ఏర్పాటు చేసిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగింది. పాలకొండ ఎల్‌వీజీజే కళాశాలలో 1981–82 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులంతా సకుటుంబ సపరివార సమేతంగా హాజరై అలనాటి జ్ఞాపకాలతో ఉత్సాహంగా గడిపారు. నాటి అధ్యాపకులు మధుసూదనరావు, జనార్ధనరావు, ప్రభాకరరావు, కూర్మేశ్వరరావు, ప్రభాకర శర్మలను.. పూర్వ విద్యార్థిని, ఉమ్మడి విశాఖ జిల్లాల ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కో–ఆర్డినేటర్ ఎస్.రూపవతి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సహచర విద్యార్థులకు 'ఏజ్‌గ్రూప్ మిత్రమండలి' ద్వారా ప్రతి నెలా ఆర్థిక సహకారం అందిస్తున్నామని చెప్పారు. రోజంతా ఉత్సాహంగా గడిపిన వారంతా ఎప్పటికీ ఈ ఒరవడిని కొనసాగిద్దామంటూ వీడ్కోలు తీసుకున్నారు.

– పీఎం పాలెం